


# సూది మందు

సుశీకి సుస్తీగావుంది: మంచం మీద పడుకొని వున్నది. ప్రక్కన రాము కూర్చున్నాడు. పరుపుమీద పరచిన గుడ్డమడతలు యిస్త్రీ చేస్తున్న వాడిలాగా కాసేపు సవరించాడు. కొంచెం సేపు నవారు పట్టెలమీద వేళ్లతో తబులా వాయించి చూపించాడు. అదీ విసుగేశాక మంచం దిగి ఒయ్యారంగా అంగలు వేస్తూ గోడదగ్గరికి పోవడం గోడదగ్గర నుంచీ మంచం దగ్గరికి రావడం- మొదలు పెట్టాడు. ఆ నడకల్లో తనకు తెలిసిన ఒక్కొక్కరి నడకనీ కాపీచేసి సుశీకి చూపెట్టాడు. అన్నా చెల్లెలు విరగబడి నవ్వుకుంటున్నారు.

శ్రీ పైడిమఱ్ఱి
వెంకటసుబ్బారావు

'అన్నయ్యా!' అంది సుశీ,వున్నట్లుండి,

'ఏం సుశీ?' అన్నాడు రాము, తన ఉత్సాహాన్నంతా ఒక్కసారిగా ఆపేస్తూ-

'తగ్గలేదురా తలనొప్పి: ఇంకా ఎక్కువయిందికూడాను'

'నాన్న మందిస్తున్నారుగా! తగ్గుతుంది లేవే!

'అంతా చేదుమందు – చంపేస్తున్నార్రా నాన్న! అయినా నొప్పి తగ్గుతేనా?'

'చేదు అంటే యెట్లాగే చెల్లాయి! జ్వరం పోవద్దూ మరి?'

'పుట్టిమందు కూడా కాదురా! సూది గుచ్చుతాడురా! ఇదిగో తొంటిమీద నిన్న గుచ్చాడు- ఎంత నొప్పి పుట్టిందనుకొన్నావ్?"

'ఏదీ నన్ను చూడనీ!'

'అమ్మో!... చేత్తో తాకకేం?- చాలా నొప్పి పుట్టుతున్నది- చేత్తో తాకావా చచ్చిపోతాను!'

'అంత నొప్పిగా ఉందటే?'



'పడుకో నియ్యటమే లేదురా'

'ఏం చేతాము?... పోనీ నాన్నతో చెప్పమంటావా చెల్లాయి?'

'అమ్మయ్యో! నాన్నతో చెప్పితే మళ్లీ సూది గుచ్చుతాడురా! ఆపాడు సూదితో చచ్చిపోతున్నాను!'

'నాన్నకు నీ వంటే కోపం యేమీ లేదే! సూది ఎందుకు గుచ్చుతాడో తెలుసా? నీ జబ్బు తొందరగా పోవాలనే-'

'సూది గుచ్చితే జబ్బు యెట్లా పోతుందిరా?'

'ఓ-మునుపటి కంటె యిప్పుడు కులాసాగా వుందా లేదా? అదంతా సూది గుచ్చబట్టే'

'నీకు తెలియదురా అన్నయ్యా! ఈ సూది నొప్పి ముందర నా జబ్బేం తెలియక మీకు అట్లాగా కనబడుతున్నదిరా! నాకేం బాగాలేదు-సూది నొప్పితో యింకో కొత్తజబ్బు వచ్చినట్లున్నదిరా! నొప్పితో చచ్చిపోతున్నాను.'

'అల్లాగా; చెల్లాయి!!'

'నా మాట అబద్ధమే మో? చూడూ! ఎంతలావు వాచిందో- సూది గుచ్చిన చోట! చేతితో మాత్రం తాకేవుసుమా!'

'నిజమేనే - చాలా వాచిందే!'

'ఈ వేళ యింకో సూది గుచ్చుతానన్నాడు నాన్న అమ్మతో - విన్నావు కదా! నాకు మళ్లా సూది గుచ్చుతాడంటే భయమేస్తున్నది. ఆమాట అనుకొంటేనే ఏడ్పు వస్తున్నదిరా!

'ఎట్లా చెల్లాయి? మరైతే!'

'ఎట్లాగైనా సరే-నాకు మళ్లీ సూది పీడ లేకుండా చేయాలిరా అన్నయ్యా! చచ్చిపోతున్నారా ఈ జబ్బుతోనే! మళ్లీ సూది గుచ్చితే నిజంగా 'చచ్చే' పోతానురా! ఆసూది పీడ లేకుంటే నిమ్మళంగా బజ్జుంటూరా!' ఏడుస్తోంది'

'ఆఁ? చచ్చిపోతావా చెల్లాయి మళ్లా సూది గ్రుచ్చుతే?'

'ఇంకా బతుకుతానా అన్నయ్యా!... మొదట గుచ్చిన సూదితోనే సగం చచ్చాను! చూడు! లేవలేను - నీతో ఆడుకోలేను-బడికి పోలేను-'

'ఔనే చెల్లాయి: మళ్లా యింకో సూది గుచ్చితే నిజంగా చస్తావులే చెల్లాయి! అయితే ఆపాడు సూది లేకపోతే చచ్చిపోవన్నమాటేగా!'

'ఔనురా! నిజంగా బ్రతుకుతానురా! ఆ సూదిని చూస్తేనే భయమేస్తుంది'

'అట్లా అయితే దాన్ని యీ యింట్లోనే ఉంచగూడదు - సూదే లేకపోతే నాన్న మళ్లా యెట్లా గుచ్చుతాడు?'

'అమ్మ బట్టలు కుట్టే మిషన్ సూదితో గుచ్చుతాడేమో రా?'

'అబ్బే! పిచ్చి పిల్లా...ఎబ్బే!... డాక్టర్లు గుడ్డలుకుట్టే సూదివాడుతారా? ఛాఛా - నాకు తెలిసినమటుకు యేడాక్టరు ఎక్కడా వాడలేదు-'

'నిజమేనా!'

'ఓ, నిజంగా'

'అయితే దాన్ని పారేస్తావు గదూ! బల్ల డ్రాయరులో చిన్న సత్తు పెట్టెలో ఉందిరా! నాన్న యింతకు మునుపే తెచ్చి పెట్టాడు- నేను ఆలోచిస్తూ చూస్తూ పడుకున్నారా! ఆపాడు సూదిని సారాయి దీపం మీద కాలుస్తాడు- వేడి వేడి సూది గుచ్చేస్తాడు.... నాన్న వచ్చేలోపలే తీసి పారెయ్యాలి తెలిసిందా? అమ్మకూడా లోపలుందిలే - వాళ్లు చూచారా గొంతు నొక్కేస్తారు-'

రాము పిల్లి అడుగులు వేసుకొంటూ గదిలోకి వెళ్లాడు. డ్రాయరు మెల్లగా లాగాడు. రాలేదు-యింకా బలంగా లాగాడు. రాలేదు—రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకు లాగేశాడు. డ్రాయరు బర్రున వచ్చేసింది. వణికే చేతులతో తొందరపడుతూ యింజెక్షను సిరెంజివున్న సత్తు పెట్టె తీశాడు - చేత్తో పట్టుకొని మెల్లగా అడుగులో అగుడు వేస్తూ గదిలో నుండి యివతలికి వస్తున్నాడు.

'ఎవరు?' కేక పెట్టింది వాళ్ల అమ్మ వంటింట్లో నుంచి.

రాము గుండెల్లో పిడుగు పడి



# ★ సూది మందు ★

...టయింది. కాలూ, చెయ్యీ ఆడ లేద [illegible] వున్నవాడు అక్కడే ఉండిపోయాడు-

'అన్నయ్యా! రారా! తొందరగా వచ్చెయ్యరా' సుశి గుసగుసలాడుతూ తొందర పెడుతూ పిలుస్తోంది.

'ఉండవే చెల్లాయి-అమ్మ అరచింది - చూసిందా చంపేస్తుంది - నాకు కాళ్లాడడంలేదు;' వణుకుతూ యెవరికీ వినపడకుండా మెల్లగా అన్నాడు-వాడికి అక్కడి నుంచి వెనక్కు పోవాలో, ముందుకు రావాలో ఏమీ తోచక తికమకగా ఉంది.

'ఎవర్రా అది! పిలుస్తే పలకరూ! గర్జిస్తూ వాళ్ల అమ్మ ఒక దూకులో వసారాలోకి వచ్చిపడ్డది. ఎదురుగా మంచం మీద సుశి మాత్రం కదలకుండా కళ్లు మూసుకు పడుకుంది. రామూ లేడు - 'ఏడీ రామూ?' అంటూ గదిలోకి చూచింది. రాము గదిలో నిల్చుని వున్నాడు కిక్కురు మనకుండా! వాడి ముఖం వెలవెల పోయింది. ఉద్యమం చెడిపోయిన నాయకుడిలాగా, పట్టుపడిపోయిన నల్లబజారు వర్తకుడిలా తలవంచుకొని నిలుచుండి పోయాడు భయంతో. మనిషి నిలువునా వణికిపోతున్నాడు.

'ఏంరా!' రామూ? ఒక గద్దింపు గద్దించింది వాళ్ల అమ్మ, 'ఔ' అని ఏడ్చేసింది సుశి.

రాము గుడ్ల నీళ్లు పొలపొల కారుస్తూ నిల్చున్నాడు.

'వాణ్ణి కోప్పడితే నువ్వు ఏడుస్తావు ఎందుకే?' అంటూ సుశిని జోకొట్టి రాము దగ్గరికి వెళ్ళింది ఆవిడ.

రాము చేతిలో ఇంజెక్షన్ సిరెంజు పెట్టె ఉంది. అబ్బాయిగారు వణుకుతూ ఆడబ్బీ తీసి వాళ్లఅమ్మ చేతిలో పెట్టేశాడు.

'ఇదెందుకు తీశావురా! దీనితో యేం ఆటలు మీకు?' అని వెంటనే మళ్లీ డ్రాయరులో పెట్టి, డ్రాయరుకు తాళంవేసి - 'ఇకపో, అవతలికి-అన్నీ వెధవ పనులు? ఎందుకా ఇంజెక్షను సూది? గుడ్లు పొడుచుకుంటావా?... వెళ్లి చెల్లాయి పక్కన కూర్చో - అక్కడి నుంచి కదిలావా చంపేస్తా-' అని కొడుకును మందలించింది. 'ఈ కుర్రకుంకలకు ప్రతిదీ కావాలి. అమ్మయ్యో! ఇంజెక్షను సూది తీశారే! వారొస్తే చంపేస్తారు-' అని గొణుక్కుంటూ తిరిగి వంటయింట్లోకి వెళ్ళిపోయి తనపని చూసుకొంటోంది. రాము, సుశి పక్కన కుక్కిన పేనులా తలవంచుకు కూర్చున్నాడు-

'అన్నయ్యా! తొందరగా ఆపాడు సూదిని తీసి పారెయ్యలేక పోయ్యావా?' గుసగుసలాడింది సుశి-

'ఏం చెయ్యమంటావే? అమ్మ అరచేసరికి చేతులూ కాళ్లు కదలలేదంటే నమ్మ.'

'మరెట్లా యీపూట?'

వాళ్లఅమ్మ ఆలకించింది కాబోలు వీళ్ల ధోరణి - 'మరొక సూది పొడవాలి' అంటూ ప్రత్యక్షమయింది లోపల నుంచే నవ్వుకుంటూ - రామూ, సుశి యిద్దరు ఒకరి ముఖం ఒకరు తేల కండ్లువేసి చూసుకున్నారు.

సాయంత్రం అమ్మాయికి యింజెక్షను యిచ్చి నాక మాఆవిడ విరగబడి నవ్వుతూ వీళ్లసంగతి నాకు చెప్పడం ప్రారంభించింది. అటు ఆ అన్నయ్య చెల్లాయి ఒక్కసారిగా యేడ్వడం మొదలు పెటారు. ఈ రెండూ చూచాను. నాకు నవ్వు వచ్చింది: ఆశ్చర్యం వేసింది.

ఒక గొప్ప మానసిక తత్వం ఎలుగెత్తి చెప్పినట్లనిపించింది. కోపంవచ్చి కేక లేస్తానేమో అనుకున్నారు వాళ్లు. అల్లా జరుగలేదు. కాని నాలో ఒక అభిప్రాయం యేర్పడిపోయింది. ఇక మీదట పసివాళ్లకు సూది పోటు లేని వైద్యం మాత్రమే చేయాలని!

నాటినుండి నేటిదాకా పిల్లల మీద యింజెక్షను ప్రయోగం చేయలేదు-సుశికి మళ్లా యింజెక్షను వాడకుండానే జబ్బు కుదిరిపోయింది.

'అమ్మాయికి యింకో సూది మందు యివ్వాలి' అని నేను అనడం-వాళ్ల తల్లి కొంటెగా చూస్తూ నవ్వడం, సుశి, రామూ గునుస్తూ వుండటం, ఇది ఇంట్లో సరదాగా ఉన్నప్పుడల్లా జరుగుతుండే హాస్యం— ★

రాజూ - పేదా

వెల: 2-0-0

పోస్టుఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమాల మద్రాసు.